

రక్షణతో పెనవేసి

గిరిజనమహిళల జీవనప్రమాణాలు మెరుగు పడేలా వారికి జనపనారతో ఆకర్షణీయమైన దుస్తులు, వస్తువులు తయారుచేయడంలో ప్రభుత్వం శిక్షణ ఇస్తోంది. - 8లో..



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ట్రైనీ ఎస్పీ అంకితా సురాన సూచించారు. జార్జ్ కాలేజీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
36/29

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కళ్లు కనిపించక గ్రామంలోకి వచ్చిన నెమలి



గ్రామస్తుల వద్ద ఉన్న నెమలి

గిద్దలూరు రూరల్: మండలంలోని సంజీవరాయుడుపేట గ్రామ సమీపంలో ఓ నెమలి అటవీ ప్రాంతంలో నుంచి కళ్లు కనిపించకపోవడంతో గ్రామస్తులకు చిక్కిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఫారెస్ట్ డీఆర్‌ఓ రాజశేఖర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం అటవీ ప్రాంతంలో నుంచి కళ్లు కోల్పోయిన ఓ నెమలి గ్రామంలో సంచరిస్తుండటంతో గ్రామస్తులు దానిని పట్టుకుని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో నెమలికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం నెమలిని స్వాధీనం చేసుకున్నట్లు డీఆర్‌ఓ తెలిపారు. దాన్ని దగ్గరలోని అటవీ ప్రాంతంలో వదిలేస్తున్నట్లు చెప్పారు.

బేస్‌లైన్ టెస్టును తప్పనిసరిగా నిర్వహించాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ యం.రమేష్

ఒంగోలు: 3 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థినీ విద్యార్థులకు ఈనెల 15న గణితం బేస్‌లైన్ టెస్టు తప్పనిసరిగా నిర్వహించాలని సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ యం.రమేష్ అన్నారు. స్థానిక యరజర్లలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన తెలుగు బేస్‌లైన్ టెస్టును పరిశీలించారు. మౌఖిక పరీక్షలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. తెలుగులో విద్యార్థుల సామర్థ్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం గణితం పరీక్షను కూడా తప్పకుండా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఎంఈవో టి.కిషోర్‌బాబు తదితరులు ఉన్నారు.

ఏపీ పీజీ సెట్‌లో కనిగిరి విద్యార్థుల సత్తా



కర్నాటి ఆదినారాయణరెడ్డి

కనిగిరి రూరల్: ఏపీ పీజీ సెట్‌లో పొలిటికల్ సైన్స్ విభాగంలో కనిగిరి విద్యార్థులు సత్తా చాటారు. కనిగిరికి చెందిన కర్నాటి ఆదినారాయణరెడ్డి స్టేట్ 2వ ర్యాంకు సాధించాడు. ఆదినారాయణరెడ్డి తల్లిదండ్రులు కర్నాటి వెంకటరెడ్డి, చిన్నక్కలు బడ్డీకొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. సివిల్స్‌లో గ్రూప్ పరీక్షలు రాసి ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగం పొందాలన్నది తన ఆకాంక్షగా ఆదినారాయణరెడ్డి తెలిపాడు. మూడో ర్యాంక్‌ని కనిగిరి పాతకూచిపూడిపల్లికి చెందిన గాలి వెంకట వినయ్‌కుమార్ సాధించాడు.

పథకాల నిధులు తల్లుల ఖాతాకు జమయ్యేలా చర్యలు

- జిల్లా షెడ్యూల్డు కులాల నోడల్ అధికారి ఎన్.లక్ష్మానాయక్



సూచనలు ఇస్తున్న జిల్లా షెడ్యూల్డు కులాల నోడల్ అధికారి ఎన్.లక్ష్మానాయక్

ఒంగోలు: నవరత్నాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాల నిధులు సకాలంలో తల్లుల ఖాతాలకు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా షెడ్యూల్డు కులాల నోడల్ అధికారి ఎన్.లక్ష్మానాయక్ సూచించారు. స్థానిక జిల్లా డ్వామా సమావేశ మందిరంలో ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి సంక్షేమ, విద్యాసహాయకులు, వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శిలతో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యాదీవెన మొదటి విడత ఫీజును తల్లిదండ్రులతో కాలేజీ యాజమాన్యానికి చెల్లించేలా చేయడం, ఎస్సీ విద్యార్థులకు ఈకేవైసీ చేయించడం, బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం(ఎన్‌పీసీఐ) చేయించడం, తల్లుల బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం (ఎన్‌పీసీఐ) చేయించడం వంటి వాటిపై దిశ దశను నిర్వహించడం గురించి సమావేశం నిర్వహించారు. సంక్షేమం, విద్యా సహాయకులు, వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి వారి లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరగా పరిష్కరించాలన్నారు.

కారడవిలో.. విద్యా సంపన్నులు

అడవిలో ఆనాడు ఓ నిరక్షరాస్యుడు వెలిగించిన అక్షర దీపం.. మహోజ్వలమైంది. ఆ ఊరంతా విద్యా కాంతులు వెదజల్లుతోంది. సమాజంలో విద్య విలువను గుర్తించారు. బతుకుదెరువు కోసం తాము వేటాడే విల్లంబులను.. చదువుపై ఎక్కుపెట్టారు. నిరక్షరాస్యత నుంచి అక్షరాలు దిద్దుకుంటూ విద్యా సంపన్నులయ్యారు. కష్టాల కన్నీళ్లు మింగిన ఆ కుటుంబాల్లో సంతోషాలు విరబూశాయి. అడవిలో విద్యాసుగంధాలు వెదజల్లుతున్నాయి. బోడేనాయక్ వేసిన విద్యాబాట.. నేడు సర్కార్ కొలువులకు రాచబాట అయింది. ఒక్కడి ఆశయం.. వందలాది మంది జీవితాల్లో వెలుగులు నింపింది. దీనికి నల్లమల అభయారణ్యంలోని ఓ గిరిజన గూడెం వేదికైంది. ఇంకెందుకాలస్యం దీని గురించి తెలుసుకుందామా మరి.

- నాడు నిరక్షరాస్యుడు వెలిగించిన అక్షరదీపంతో నేడు వెలుగులు
- గిరిజనుల్లో విద్యపై మక్కువ పెంచిన బోడేనాయక్
- 667 ఓటర్లున్న చిన్న తండాలో 80 మందికి పైగా ఉద్యోగస్తులే
- సమష్టి కృషితో నూరు శాతం అక్షరాస్యత
- సుగాలీల సంప్రదాయ రీతిలో శుభకార్యాలు



బోడేనాయక్ తండా గ్రామ వ్యూ

సాక్షిప్రతినిధి, ఒంగోలు: అది పెద్దదోర్నాల మండలంలోని నల్లమల అభయారణ్య ప్రాంతం. ఆ ప్రాంతం పరిధిలో కొన్ని గిరిజన గూడేలతో పాటు మరి కొన్ని తండాలు ఉన్నాయి. వాటిల్లో సట్టుతండా ఒకటి. ఆ ఊరిలో చదువుకున్న వారు ఎవరూ లేకపోవడంతో చిన్న ఉత్తరం వచ్చినా ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న బొమ్మలాపురానికి కాలినడన వెళ్లి చదివించుకోవాల్సిన పరిస్థితి. ఆ ఊరిలో నివాసముంటున్న బోడేనాయక్ విద్యపై మక్కువతో సొంత డబ్బులతో పాఠశాలను నిర్మించాడు. నిరక్షరాస్యుడైనా 1954లో సొంత ఖర్చులతో ఉపాధ్యాయుడిని నియమించి ప్రతి ఒక్కరూ చదువుకునేలా పాటు పడ్డాడు.

ఎవరీ బోడేనాయక్...

బోడేనాయక్ పూర్వీకులది రాజస్థాన్. హాదీరాం వంశంలోని బంజారా తెగకు చెందిన బోడేనాయక్ పూర్వీకులకు పశు సంపద ఎక్కువగా ఉండేది. వీరంతా బిడారు వ్యాపారం (పశువుల మీద సరుకులను రవాణా చేయడం) చేస్తూ సంచార జీవనం సాగిస్తుండేవారు. క్రమంగా వారంతా దక్షిణ భారత దేశానికి వలస వచ్చారు. రైలు మార్గం, తంతి



తండాలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు

తపాలా సేవలు అందుబాటులోకి రావటంతో బిడారు వ్యాపారం దెబ్బతింది. దీంతో బోడేనాయక్, మరికొంత మంది కలిసి మార్కాపురం డివిజన్ ప్రాంతానికి చేరుకున్నారు. వీరికున్న పశు సంపదకు పశుగ్రాసం కొరత రావడంతో 1940లో పెద్దదోర్నాల, శ్రీశైలం మధ్య నల్లమల అటవీ ప్రాంతంలోని సట్టుతాండాకు చేరుకుని అక్కడే స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. 1955 వరకు శ్రీశైలానికి దోర్నాల అటవీ ప్రాంతం నుంచి సరుకులు రవాణా చేస్తూనే 270 ఎకరాల అటవీ భూముల్లో వ్యవసాయం ప్రారంభించారు. బోడేనాయక్ కృషితో 1973లో ఆ భూములకు ప్రభుత్వం పట్టాలిచ్చింది. ఇదిలా ఉండగా బోడేనాయక్ కుమారుడు బాలాజీనాయక్ 1995 నుంచి 2001 వరకు పెద్దదోర్నాల ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం ఆయన భార్య భారతీబాయి పెద్దబొమ్మలాపురం పంచాయతీ సర్పంచ్‌గా 2019 వరకు బాధ్యతలు చేపట్టారు. తరువాత ఆమె కోడలు దుమావత్ లతాభాయి ప్రస్తుత జెడ్పీటీసీ సభ్యురాలిగా కొనసాగుతున్నారు.

బోడేనాయక్ తండాగా పేరు మార్పు..

సట్టుతండాగా ఉన్న గ్రామాన్ని 2022 సెప్టెంబర్ 26వ తేదీన ప్రభుత్వం బోడేనాయక్ తండాగా పేరును మారుస్తూ జీఓ నెం.32ను విడుదల చేసింది. దీంతో పాటు బోడేనాయక్ తండా, మర్రిపాలెం గిరిజన గూడేలను కలిపి బోడేనాయక్ తండా గ్రామ పంచాయతీగా ప్రభుత్వం రాజపత్రాన్ని విడుదల చేసింది. 2002 నుంచి బోడేనాయక్ కుమారుడు బాలాజీనాయక్ తండా పేరు మార్పు కోసం కృషి చేశారు. ఆయన మరణానంతరం ఆయన మనవడు చంద్రకాంత్‌నాయక్ పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సహకారంలో బోడేనాయక్ తండాగా పేరును మార్చేలా కృషి చేసి సఫలీకృతులయ్యారు. అయితే తండాలో వాడకంలో వీరి భాష హిందీని పోలి ఉంటుంది. విద్యాధికులు అధికంగా ఉన్న వీరి భాషకు లిపి లేక పోవటం విచారకరం.

సుగాలీల సంప్రదాయ రీతిలో శుభకార్యాలు

తండాలో నివసించే సుగాలీలు పండుగలు, శుభకార్యాలకు ప్రాధాన్యత ఇస్తారు. ముఖ్యంగా దీపావళిని ఘనంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా మాంసాహారంతో పాటు, తమ పూర్వీకులకు ఇష్టమైన అన్ని రకాల ఆహార పదార్థాలను తయారు చేసుకుని పెద్దలకు పెట్టడం ఆనవాయితీ. చెట్లకు ఊయలలు వేసి ఊగడంతో పాటు, సాయంత్రం యువతులు దీపాలతో తండాలోని ప్రతి ఇల్లు తిరిగి పెద్దలు ఇచ్చే కానుకలను తీసుకుంటూ ఆశీర్వాదం పొందుతారు. శ్రీరామనవమిని కూడా కలిసికట్టుగా, భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. వీరి వివాహాలు హిందూ సంప్రదాయ రీతిలోనే కొనసాగుతాయి.

ప్రొఫెసర్లు:	2	సచివాలయ సిబ్బంది:	8
అగ్రికల్చర్ ఏడీఏలుఏ:	2	ఫారెస్టు డిపార్ట్‌మెంట్:	10
అగ్రికల్చర్ ఏఓలు:	2	హాస్టల్ వార్డన్లు:	3
హార్టీకల్చర్ అధికారి:	1	ఏపీఎస్ ఆర్టీసీ:	3
ప్రభుత్వ డాక్టర్లు:	3	ఫార్మా కంపెనీ:	5
ఉపాధ్యాయులు:	6	రక్షణశాఖ:	5
వెటర్నరీ అధికారులు:	2	ఎంఈఓ:	1

చదువుకుంటేనే సమాజంలో గుర్తింపు



మారుతున్న నేటి సమాజంలో చదువుకుంటేనే సమాజంలో గుర్తింపు ఉంటుంది. ప్రతి ఒక్కరూ చదువుకుని ఉన్నత స్థానాల్లో ఉండాలనేదే తండా వాసునిగా నా కోరిక. నాతో పాటు చాలా మంది ఉన్నత స్థానాల్లో ఉద్యోగాలు చేస్తుండటం ఎంతో సంతోషం.

– తులసీనాయక్, ప్రొఫెసర్, ఎస్కే యూనివర్సిటీ, అనంతపురం



శ్రీశైలం రోడ్డు నుంచి తండాకు రహదారి సౌకర్యం

667 ఓటర్లున్న చిన్న తండాలో 80 మందికి పైగా ఉద్యోగస్తులే...

బోడేనాయక్ తండాలో పుట్టిన వారందరూ చదువుల తల్లి ఆశీర్వాదం పొందిన వారే. ఈ గ్రామంలో విద్యాభ్యాసం చేసిన సుమారు 80 మందికి పైగా ప్రభుత్వంలోని పలు శాఖల్లో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అందులో ప్రొఫెసర్లు, వ్యవసాయశాఖ అధికారులు, డాక్టర్లు, హాస్టల్ వార్డన్లు, ఉపాధ్యాయులు, అటవీశాఖ, ఆర్టీసీ, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, పోలీసు శాఖ, సచివాలయాల్లోనే కాక మరికొందరు కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలు నిర్వర్తిస్తున్నారు.

ఇంటి కోడలైనా చదువుకే మొదటి ప్రాధాన్యత



తాండాలోని ఇంటికి కోడలుగా రావాలన్నా చదువుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వటం ఇక్కడి ఆచారం. 667 ఓటర్లున్న మా తండాలో 80 మందికి పైగా ఉద్యోగస్తులే. అందుకే ఇక్కడ చదువుకు ఇంతటి ప్రాధాన్యతనిస్తారు. తాండాలోని ప్రజలు తమ పిల్లలను సమీపంలోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో చేర్పిస్తుంటారు.

– దుమావత్ లతాచంద్రకాంత్ నాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు

నాతో పాటు మరో ఏడుగురికి సచివాలయ ఉద్యోగాలు



చదువుకోవటం వల్లే తాండాకు చెందిన ఎనిమిది మందికి సచివాలయాల్లో ఉద్యోగాలొచ్చాయి. మా తాండాలో అక్షరాస్యత శాతం ఎక్కువ. ప్రతి ఒక్కరినీ పాఠశాలకు పంపించటం ఇక్కడి ఆనవాయితీ. మా తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మమ్మల్ని చదివించారు.

– పాత్లావత్ వకుల్లాబాయి, మహిళా పోలీస్, పెద్దదోర్నాల

సామాన్యులకు తోడుగా జగనన్న సురక్ష

- రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పుల్లలచెరువు: సామాన్యులకు తోడుగా జగనన్న సురక్ష కార్యక్రమం నిలుస్తోందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని ఐటీవరం గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు మరిన్ని సౌకర్యాలు అందజేయాలని, గ్రామాల్లో ఎవరైనా అర్హులైన వారుంటే పథకాలు అందజేయాలనే లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. దీని ద్వారా ఉచితంగా 11 రకాల సేవలు అందిస్తారన్నారు. గ్రామాల్లో వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి అర్హతే ప్రామాణికంగా, కులం, మతం, పార్టీలను చూడకుండా అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారన్నారు. వలంటీర్లు గౌరవ వేతనం తీసుకుంటూ స్వచ్ఛందంగా పనిచేస్తున్నారని, వారి సేవలు వెలకట్టలేనివి అన్నారు. కరోనా సమయంలో రాష్ట్రంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి పనిచేశారని, ఈ విషయంలో రాష్ట్ర ప్రజలంతా వ్యవస్థను మెచ్చుకున్నారన్నారు. వలంటీర్‌తోనే ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలోని వలంటీర్ వ్యవస్థను దేశమంతా అనుసరించేందుకు ప్రయత్నిస్తున్నారంటే అది ఎంతగా పనిచేస్తుందో అందరికీ తెలుసన్నారు.

మహిళలంటే గౌరవం లేని వ్యక్తి పవన్ కళ్యాణ్:

రాష్ట్రంలో మహిళలంటే గౌరవం లేని వ్యక్తి జనసేన నేత పవన్‌కళ్యాణ్ అని మంత్రి సురేష్ అన్నారు. ఇటీవల వలంటీర్ వ్యవస్థపై పవన్ అనుచితంగా మాట్లాడడం దారుణం అన్నారు. రాష్ట్రంలో వలంటీర్లు చేస్తున్న సేవలను ప్రజలు గుర్తించారని, సినిమాలు చేసుకునే పవన్‌కు ఈ వ్యవస్థ గురించి ఏం తెలుసని ఎద్దేవా చేశారు. వ్యవస్థల గురించి తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. వలంటీర్లలో 50 శాతం మహిళలే ఉన్నారని, మహిళలంటే గౌరవం, వివాహ వ్యవస్థపై నమ్మకం లేని పవన్ వారి గురించి అసత్యాలు మాట్లాడడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మహిళలే పవన్‌కు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. వలంటీర్లు అందజేస్తున్న పథకాల్లో అన్ని పార్టీల వారు ఉన్నారని, ఇది గమనించాలన్నారు. ఎవరో చెప్పే మాటలు విని మహిళా లోకాన్ని కించపరచడం అన్యాయం అన్నారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ లాజర్, జెడ్పీటీసీ వాగ్యానాయక్, డీఎల్‌డీవో సాయి కుమార్, తహశీల్దార్ దాసు, ఎంపీడీవో మరియదాసు, ఎంఎల్‌ఓ వాసు, సచివాలయ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు రోసిరెడ్డి, గడ్డం సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

ఆపదలో అండగా..



పాలెపు ఖాదరమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ తుమ్మలపూడి వెంకటేష్

సింగరాయకొండ: ఈమె పేరు పాలెపు ఖాదరమ్మ. సింగరాయకొండ మండలం మూలగుంటపాడు పంచాయతీలో తన పెద్ద కూతురు లక్ష్మి వద్ద ఉంటోంది. ఈమె మూడు నెలల క్రితం సింగరాయకొండ నుంచి 150 కి.మీ దూరంలో ఉన్న వినుకొండ అడవుల్లోని తండాలో నివసిస్తున్న చిన్న కూతురు లక్ష్మిని చూసేందుకు వెళ్లి అక్కడ ప్రమాదవశాత్తు జారిపడటంతో ఆమె ఎడమ చేయి విరిగింది. వినుకొండ వరకు మాత్రమే బస్సు సదుపాయం ఉండగా అక్కడ నుంచి తండా వద్దకు 5 కి.మీ ద్విచక్ర వాహనంపై వెళ్లాలి. ఖాదరమ్మ కదలలేని స్థితిలో ఉండటంతో గ్రామ వలంటీర్ తుమ్మలపూడి వెంకటేష్ మోటారు సైకిల్‌పై ఆ తండాకు వెళ్లి స్వయంగా పింఛన్ అందజేశాడు. ఆమె పరిస్థితి చూసి తానే దగ్గరుండి వినుకొండ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించాడు.

ఆస్పత్రిలో చేర్చి ఆదుకున్నాడు..

నేను మా చిన్న కూతురుని చూసేందుకు తండాకు వచ్చాను. కాలుజారి పడి నా ఎడమచేయి విరిగింది. ఆస్పత్రికి వెళ్లాలంటే డబ్బులు లేక ఇంటి దగ్గరే ఉండి పసరు వైద్యం చేయించుకుంటున్నాను. అప్పుడు మా వలంటీర్ వెంకటేష్ అంతదూరం నా దగ్గరకు వచ్చి పింఛన్ ఇవ్వడంతో పాటు నా దుస్థితిని చూసే తానే దగ్గరుండి వినుకొండ ఆస్పత్రిలో చేర్పించి ఆదుకున్నాడు.

– పాలెపు ఖాదరమ్మ, మూలగుంటపాడు, సింగరాయకొండ మండలం

శాంతిభద్రతలే టార్గెట్

- మలికాగర్గ్ ఎస్పీగా రెండేళ్లు పూర్తి
- పోలీసింగ్‌లో తనదైన ముద్ర
- అనేక అవార్డులు సొంతం
- జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు తెచ్చిన ఎస్పీ



గన్ ఎక్కు పెడుతున్న ఎస్పీ మలికాగర్గ్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లా ఎస్పీగా మలికా గర్గ్ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయింది. నేటితో మూడో సంవత్సరంలోకి అడుగు పెడుతున్నారు. మొదటిసారి ఎస్పీగా పదోన్నతి పొందగానే తొలి బాధ్యతలు జిల్లాలోనే చేపట్టారు. పోలీస్ విభాగంలో పనిచేసే కింది స్థాయి సిబ్బంది నుంచి ఏఎస్పీ స్థాయి అధికారి వరకు, కలెక్టర్ మొదలుకొని వివిధ శాఖల అధికారుల సహకారంతో పోలీసింగ్‌లో తనదైన ముద్ర వేసుకొని ముందుకు సాగుతున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రెండో మహిళా ఎస్పీగా మలికాగర్గ్ పనిచేస్తున్నారు. మొదటి ఎస్పీగా చారుసిన్హా పనిచేశారు.

మలికాగర్గ్ ఎస్పీగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన ప్రధానమైన కేసులన్నీ దాదాపు ఛేదించారు. దొంగతనాల కేసుల రికవరీ, హత్య కేసులను జిల్లా పోలీసులు సత్వరం ఛేదించారు. న్యాయవ్యవస్థతో సమన్వయంతో ముందుకు సాగటంతో అనేక మంది నిందితులకు శిక్షలు పడ్డాయి. బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ రహదారి ప్రమాదాలు తగ్గించగలిగారు.

పోలీసింగ్‌లో జిల్లాకు అనేక అవార్డులు:

ఎస్పీగా మలికాగర్గ్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి జిల్లాకు అనేక అవార్డులు వచ్చి వరించాయి. ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో స్కోచ్ అవార్డు, డిజిటల్ టెక్నాలజీ సభ ఎక్స్‌లెన్స్ అవార్డు, గవర్నెన్స్ నౌతో గోల్డ్ ట్రోఫీ అవార్డు, ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో రెండో సారి స్కోచ్ అవార్డు, స్కోచ్ సిల్వర్ అవార్డులు వచ్చాయి.

హనుమంతునిపాడు పోలీస్ స్టేషన్ రాష్ట్రంలోనే ఉత్తమ పోలీస్ స్టేషన్ అవార్డు దక్కించుకుంది. వలేటివారిపాలెం మండలం చుండి పోలీస్ స్టేషన్‌కు ఉత్తమ పోలీస్ స్టేషన్ అవార్డు దక్కింది. సచివాలయాల్లో పనిచేసే మహిళా పోలీసులకు కూడా పవర్స్ ఇచ్చారు. కొన్ని కేసుల్లో వాళ్లు ఇచ్చిన కీలకమైన సమాచారంతోనే ఛేదించారు. గిద్దలూరులో పురిటి బిడ్డను చంపిన కేసులో మహిళా పోలీస్ ద్వారానే నేరస్తులను పట్టుకున్నారు. సెల్‌ఫోన్ల రికవరీ చేపట్టి రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా జిల్లాలో వేలాది సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. కొత్త కొత్త ఆలోచనలతో కేసుల పరిష్కారానికి పూనుకొని సిబ్బందిని ప్రోత్సహిస్తూ వస్తున్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో ప్రజలకు ఎంతో మేలు

సింగరాయకొండ: విలేజ్ హెల్త్ క్లినిక్‌ల వలన ప్రజలకు ఎంతో మేలని వైద్య రంగంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నారని నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రాజెక్టు మానిటరింగ్ అధికారి డాక్టర్ టీ వాణిశ్రీ అన్నారు. మండలంలో నిర్మాణంలో ఉన్న సింగరాయకొండ- 2, 3, కనుమళ్ల విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. డాక్టర్ వాణిశ్రీ మాట్లాడుతూ జిల్లాలో 492 హెల్త్ క్లినిక్‌లు నిర్మిస్తుండగా వాటిలో 38 పూర్తి కాగా, 339 చివరి దశలో ఉన్నాయని, 115 బేస్‌మెంట్ దశలో ఉన్నాయని వివరించారు. ఆగస్టు 15వ తేదీ సాధ్యమైనన్ని భవనాలు ప్రారంభించటానికి లక్ష్యంగా పెట్టుకున్నామని మిగిలిన భవనాలన్ని సెప్టెంబరు 30వ తేదీ కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. మండలంలో మూడు భవనాలు పూర్తి కావచ్చాయని, ఈ భవనంలో సిబ్బంది ఉండటానికి వసతులతో పాటు ఆస్పత్రిని కూడా ప్రత్యేకంగా నిర్మిస్తున్నట్లు ఆమె వివరించారు. ఈ మూడు భవనాలకు నీటి కొరత ఉందని, బోర్లు వేయాలని అధికారులకు సూచించామన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నోడల్ అధికారి డాక్టర్ బీ మాధవీలత, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.



డ్రైవర్ పేటలో నిర్మాణంలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ మాధవీలత

ఒకవైపు అటవీ సంపదను కాపాడుకుంటూనే మరోవైపు గిరిజనుల్లో పరివర్తన తీసుకొస్తూ వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చేలా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తద్వారా నాటు సారా, అటవీ సంపద అక్రమ విక్రయాలకు చెక్ పెడుతోంది. అత్యంత చౌకగా లభించే జనపనారతో వస్తువులు తయారు చేసేలా అటవీశాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తోంది. ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవసరమైన యంత్రసామగ్రి సమకూరుస్తోంది. వారు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాన్ని సైతం కల్పిస్తోంది. జిల్లాలో దశల వారీగా గిరిజన మహిళలకు శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తోంది.

రక్షణతో పెనవేసి

ఒంగోలు డెస్క్



శిక్షణ పొందుతున్న మహిళలు

- జనపనారతో గిరిజన మహిళలకు ఉపాధి
- అటవీశాఖ ఆధ్వర్యంలో శిక్షణ
- దోర్నాల, గిద్దలూరుల్లో శిక్షణ పూర్తి
- త్వరలో మట్టిగాజుల తయారీపై కూడా..
- నాటుసారా, అటవీ సంపద అక్రమ రవాణాకు చెక్
- ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తోడ్పాటు

జిల్లాలో విస్తరించి ఉన్న నల్లమల అటవీ ప్రాంతం సమీప గూడేల్లోని చెంచులు, గిరిజనులు నాటుసారా తయారీతో పాటు వెదురు బొంగులు, ఇతర కలప కోసం అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. వీటికి చెక్‌పెట్టేలా అటవీశాఖ చర్యలు చేపట్టింది. అటవీ సంరక్షణలో భాగంగా నాగార్జునసాగర్ రిజర్వు టైగర్ ఫారెస్ట్ పరిధిలో గిరిజన, చెంచుగూడేల్లోని మహిళలకు జీవనోపాధి కల్పించడం ద్వారా పరివర్తన తీసుకొచ్చేందుకు ప్రత్యేక దృష్టి సారించింది. ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేలా ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో దశలవారీగా అమలు చేస్తోంది. చౌకగా లభించే జనపనారతో అత్యంత ఆకర్షణీయంగా వస్తువులు, దుస్తులు తయారు చేసేలా శిక్షణ ఇస్తోంది. తొలుత దోర్నాల పరిధిలోని చింతల, తుమ్మలబైలు ప్రాంతాల్లోని గిరిజన మహిళలకు గణపతి చెక్‌పోస్టు వద్ద శిక్షణ ఇచ్చింది. వారికి రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ ద్వారా కుట్టుమిషన్లు కూడా పంపిణీ చేసింది. అంతేగాకుండా వీరు తయారు చేసిన ఉత్పత్తులను స్థానికంగానే విక్రయించుకునేలా ఏర్పాట్లు చేసింది. గణపతి చెక్‌పోస్టు వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న 'సావనీర్ స్టాల్స్‌'లో ఉంచుతోంది. శ్రీశైలానికి వెళ్లే భక్తులతో పాటు నల్లమల అందాలను వీక్షించడానికి వచ్చే పర్యాటకులు వీటిని కొనుగోలు చేస్తున్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వస్తువుల వినియోగం ద్వారా వాటిల్లుతోన్న ముప్పుపై సైతం వీరికి అవగాహన కల్పిస్తున్నారు. రెండో దశలో గిద్దలూరు సమీపంలోని దిగువమెట్ట గ్రామంలో 150 మంది ఎస్సీ, ఎస్టీ మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. వీరు నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు సంపాదించుకునేలా మెళకువలు నేర్పిస్తున్నారు.

జనపనారతో తయారయ్యే వస్తువులు ఇవే...

జనపనారతో స్లింగ్ బ్యాగ్, పెన్సిల్ పౌచ్, లంచ్ బ్యాగ్, స్కూల్ బ్యాగ్, గిఫ్ట్ బ్యాగ్, హ్యాండ్ బ్యాగ్, వెజిటేబుల్ బ్యాగ్, డ్రం లగేజ్ బ్యాగ్, వాటర్ బాటిల్ బ్యాగ్, టెంపుల్ బ్యాగ్, హ్యాండ్ పర్స్, ఫ్రిజ్ కవర్, వాల్ టికెట్స్, డైనింగ్ టేబుల్ పాడ్స్, డోర్ కర్టెన్స్, స్టిక్ బ్యాగ్, లాప్టాప్ బ్యాగ్ లాంటి 33 రకాల ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. వీటికి అవసరమైన ముడి సరుకును తూర్పుగోదావరి జిల్లా నుంచి తీసుకొస్తున్నారు. శిక్షణ ఇచ్చేందుకు రెడ్ శాండిల్ ప్రొటెక్షన్, టైగర్ కన్సర్వేషన్ శాఖల ఆధ్వర్యంలో రూ.5 లక్షలతో ఈ యూనిట్ ప్రారంభించారు. 45 రోజుల్లో 150 మందికి శిక్షణ ఇచ్చారు. త్వరలో మహిళలకు మట్టిగాజుల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు.





గిరిజనుల్లో మార్పు...



ఈ ఏడాది మే 14 తేదిన ఎమ్మెల్యే అన్నా రాంబాబు చేతుల మీదుగా శిక్షణ ప్రారంభించాం. ఎస్సీ, ఎస్టీ గిరిజనుల్లో పెద్ద ఎత్తున మార్పు తీసుకొచ్చాం. అటవీ సంపదను కాపాడుకుంటున్నాం. గిరిజన మహిళలకు శిక్షణ ఇస్తూ వారు ఆర్థికంగా ఎదిగేందుకు అండగా నిలుస్తున్నాం. జనపనార ఉత్పత్తుల తయారీ, వాటి మెళకువలపై పూర్తిస్థాయి శిక్షణ ఇస్తున్నాం. అటవీశాఖ ఆధ్వర్యంలో అవుట్‌లెట్ ఏర్పాటు చేసి వీరు తయారు చేసిన ఉత్పత్తుల విక్రయాలు జరిగేలా చూస్తాం. పురుషులకు సైతం జీవనోపాధి కల్పించేలా పలు రకాల యూనిట్లను ప్రారంభించనున్నాం.

– నరసింహారావు, డిప్యూటీ డైరెక్టర్, అటవీశాఖ, గిద్దలూరు

జీవితంపై భరోసా



ఇలాంటి శిక్షణతో మేము అడవికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే జీవనోపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయి. జీవితంపై భరోసా ఏర్పడింది.

– అనిత, గృహిణి

మంచి అవకాశాలు లభిస్తాయి



మా కుటుంబ పోషణ నిమిత్తం నిత్యం టైలరింగ్ చేసుకునేదాన్ని. కానీ, టైలరింగ్‌తో కుటుంబ పోషణ గడిచేది కాదు. జనపనార ట్రైనింగ్ ప్రోగ్రాంతో జీవనోపాధి అవకాశాలు లభిస్తాయని అనుకుంటున్నా.

– సలోమి, గృహిణి

మాకెంతో ప్రయోజనం



కుటుంబ పోషణకై అడవిలోకి వెళ్లి వెదురు బొంగులు తెచ్చుకుని రైల్లో ప్రయాణించి ఇతర జిల్లాల్లో అమ్ముకునే దాన్ని. అయినా కూడా కుటుంబ పోషణ కష్టంగా ఉండేది. వారం రోజులు కష్టపడితే రూ.1000 వచ్చేవి. అలాంటిది.. ప్రస్తుతం ఇస్తున్న శిక్షణతో మా కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతాయి.

– సుబ్బులక్ష్మి

150 మందికి శిక్షణ పూర్తి చేశాం



యూనిట్ ప్రారంభించిన అనతి కాలంలోనే 150 మంది వరకు శిక్షణ పూర్తి చేశాం. శిక్షణ సమయంలో జనపనారతో 33 రకాల ఉత్పత్తులను నాణ్యతతో ఎలా తయారు చేయాలి, వాటిలోని మెళకువలపై శిక్షణ అందజేశాం. రాష్ట్రవ్యాప్తంగా పలు శిక్షణ కేంద్రాల్లో 1500 మందికి శిక్షణ ఇచ్చాం. మొదట్లో మహిళలు పెద్దగా ఆసక్తి చూపలేదు. వారికి పూర్తిగా అవగాహన కల్పించిన తర్వాత ముందుకొచ్చారు.

– లక్ష్మి, ట్రైనర్


జనపనారతో తయారు చేసిన పౌచ్‌లు, బ్యాగులు

ప్రజాసేవకే నా జీవితం అంకితం

- గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు

కంభం: ప్రజాసేవకే తన జీవితం అంకితమని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు అన్నారు.శుక్రవారం కంభంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ 15 ఏళ్ల తన రాజకీయ జీవితంలో గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజలతో మమేకమయ్యానని వారు కూడా అదే ఆదరణ తనపై చూపుతున్నారన్నారు. నా ఆస్తులు అమ్ముకొని రాజకీయాల్లో కొనసాగుతున్నానే తప్పా ఏనాడూ అవినీతికి పాల్పడలేదన్నారు. నియోజకవర్గంలో ఇటీవల తనపై కొందరికి వ్యతిరేకం అంటూ ముద్ర వేస్తూ దుష్ప్రచారం చేస్తుండటం దుర్మార్గమైన చర్య అని నియోజకవర్గంలోని ప్రజలంతా తనకు సమానమేనన్నారు. నన్ను నాకుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని వ్యక్తిగతంగా దూషించి అవమానిస్తున్న ముగ్గురు, నలుగురిని ఉద్దేశించి మాత్రమే గతంలో బేస్తవారిపేటలో జరిగిన ఓ సమావేశంలో మాట్లాడానే తప్ప వేరే ఉద్దేశం లేదని తెలిపారు. ఆ మాటలను వక్రీకరిస్తూ అందరిపై రుద్దడం సమంజసం కాదన్నారు. నియోజకవర్గంలో పార్టీలో కీలక బాధ్యతల్లో ఉన్న కొందరు పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించడం, మాట్లాడటం బాధాకరమన్నారు. వైఎస్సార్ సీపీ మనందరికి తల్లి లాంటిదని అలాంటి పార్టీలో ఉన్నవారందరు కలిసి మెలసి ఉంటూ పార్టీ అభివృద్ధికి పాటుపడాలే కానీ, చెడ్డపేరు తెచ్చే పనులు చేయకూడదన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా

అన్ని వర్గాలకు చేరువలో సంక్షేమ పథకాలు

- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

పుల్లలచెరువు: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు చేరువ చేశారని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని శతకోడులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మాట్లాడారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో నూతన పాలనకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఆయన ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో పుట్టిన బిడ్డ నుంచి పండు ముదుసలి వరకు ప్రభుత్వం నుంచి ఏదో ఒక విధంగా లబ్ధి పొందుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్రంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని, పేద, బడుగు బలహీన వర్గాల కోసం ప్రణాళికతో సేవలందించేది జగనన్న ఒక్కరేనన్నారు. ప్రజలు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు రాగా అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ లాజర్, జెడ్పీటీసీ వాగ్యానాయక్, డీఎల్‌డీవో సాయికుమార్, తహసీల్దార్ దాసు, ఎంపీడీవో మరియదాసు, ముటుకుల పీఏసీఎస్ చైర్మన్ కృష్ణ, ఎంపీటీసీ రాములు, ఎంఎల్ఓ వాసు, సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ డైరెక్టర్లు రఘు, శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు రోసిరెడ్డి, సుబ్బయ్య, పోలరెడ్డి, బ్రహ్మనందరెడ్డి, ఎర్రయ్య పాల్గొన్నారు.


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి సురేష్

మనుమడిలా సేవలు అందిస్తున్నాడు

కందుకూరు రూరల్: మండలంలోని కొండముడుసుపాలెం అంబేడ్కర్ నగర్‌కు చెందిన వలంటీర్ జి.శ్రీకాంత్ మనవడిలా సేవలందిస్తున్నాడని దివ్యాంగురాలు ఎం.ఆదిలక్ష్మమ్మ తెలిపారు. ఇంట్లో ఒక్కదానినే ఉంటాను. దివ్యాంగుల పింఛన్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్నాను. రెండు కాళ్లు పని చేయవు. కరోనా సమయంలో ఇంట్లోకి ఏ వస్తువు కావాలన్నా ఎవరూ సాయం చేసేవారు కాదు. వలంటీర్ శ్రీకాంత్ ఇంటికి వచ్చి ఏం కావాలో అడిగి ఇంట్లోకి సరుకులు, కూరగాయాలు తీసుకొచ్చి ఇచ్చేవాడు. వలంటీర్ వేలిముద్ర వేసి బియ్యం తీసుకొచ్చి ఇంటి వద్ద ఇస్తాడు.


దివ్యాంగురాలు ఆదిలక్ష్మమ్మతో వేలిముద్ర వేయిస్తున్న వలంటీర్ శ్రీకాంత్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ట్రైనీ ఎస్పీ అంకితా సురానా

మార్కాపురం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ట్రైనీ ఎస్పీ అంకితా సురానా తెలిపారు. శుక్రవారం జార్జి కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు వివిధ పద్ధతులు పాటిస్తున్నారని, ఓటీపీలు, ఆధార్ నంబర్లు, బ్యాంకు అకౌంటు నంబర్లు బయట వ్యక్తులకు ఎవరికీ చెప్పవద్దని తెలిపారు. గంజాయి, డ్రగ్స్, లిక్కరుకు దూరంగా ఉండాలని సూచించారు. కష్టపడి చదివితే సివిల్ సర్వీసెస్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించి ప్రజా సేవ చేయవచ్చని ఆమె తెలిపారు. సెల్‌ఫోన్‌ను దుర్వినియోగం చేయవద్దని, సమాచారం కోసం ఉపయోగించుకోవాలన్నారు. ఎస్ఐలు సువర్ణ, వెంకటేశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ట్రైనీ ఎస్పీ అంకితా సురానా

లారీ ఢీకొని యువకుడి మృతి

త్రిపురాంతకం: నేషనల్ హైవేపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని రాజుపాలెం సమీపంలో శుక్రవారం జరిగింది. బైకును మినీ లారీ ఢీకొనడంతో గల్లా వెంకటేశ్వర్లు (45) మృతి చెందాడు మరొక వ్యక్తి లింగారెడ్డి గాయపడ్డాడు. వీరిలో వెంకటేశ్వర్లుది విశ్వనాథపురం, లింగారెడ్డిది పెద్దారవీడు మండలం పోతంపల్లి. ప్రమాద స్థలాన్ని ఎస్ఐ సుమన్ పరిశీలించి విచారణ చేపట్టారు.

పద్మ అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు అర్బన్: అత్యున్నత అవార్డులైన పద్మ విభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డులు – 2024 కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. పూర్తి సమాచారం కోసం ప్రభుత్వ వెబ్‌సైట్ www.padmaawards.gov.in ను సంప్రదించాలని సూచించింది. దరఖాస్తులను https://awards.gov.in పోర్టల్‌లో పూర్తి చేసి ఆగస్టు 5వ తేదీలోపు సబ్‌మిట్ చేయాలని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులు స్వీకరించబడవని స్పష్టం చేశారు. అవార్డులకు ఎంపికైన వారికి గణతంత్ర దినోత్సవం రోజు అవార్డులు అందజేస్తారని తెలిపారు. జిల్లాలో అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మికుల సంక్షేమంలో రాజీపడం

- జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)లో పనిచేసే కార్మికుల సంక్షేమం విషయంలో రాజీ పడేది లేదని కార్మిక చట్టాల మేరకు వారికి అందాల్సిన సదుపాయాలు అందిస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ భగవాన్ నాయక్ స్పష్టం చేశారు. దళిత కార్మిక సంఘాల విజ్ఞప్తి మేరకు ఏఐజీఈఎల్ సెక్యూరిటీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులతో కలిసి జీజీహెచ్ సమావేశ మందిరంలో డిప్యూటీ సూపరింటెండెంట్ బాలాజి నాయక్, ఆర్ఎంఓ చైతన్యవర్మలతో కలిసి సమావేశం నిర్వహించారు. దీనిలో భగవాన్ నాయక్ మాట్లాడుతూ ఒకటో తేదీలోపు కార్మికులకు ఈఎస్ఐ కార్డులు అందజేయాలన్నారు. 15 రోజులు షిఫ్ట్ విధానాన్ని అమలు చేస్తామన్నారు. వేతనాల చెల్లింపు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్మికుల శ్రమను గుర్తించి వారికి గౌరవం ఇచ్చి పనిచేయించుకోవాలన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ బాలాజి నాయక్ మాట్లాడుతూ మహిళా కార్మికుల సమస్యల్ని దృష్టిలో ఉంచుకుని సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు తీసుకుంటామన్నారు. దీనిలో దళిత సంఘాల నాయకులు నీలం నాగేంద్ర, సుజన్, అంజయ్య, కార్మిక సంఘాల నాయకులు సర్దార్, చౌదరి తదితరులు పాల్గొన్నారు.


దళిత కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్

పశువైద్యంలో విప్లవాత్మక మార్పు

ఒంగోలు సబర్బన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పశువైద్యంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. పశ్చిమ ప్రకాశంలోని త్రిపురాంతకం మండలం కిరసాలగూడెం గ్రామానికి చెందిన నీలం బాలకోటయ్య గేదె ఈనడం కష్టంగా మారింది. దూడ అడ్డం తిరిగిందని స్థానిక పశువైద్య సిబ్బంది చెప్పారు. దీంతో వెంటనే హెల్ప్‌లైన్ నంబర్–1962కు ఫోన్ చేశారు. డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనం గ్రామానికి చేరుకుంది. గర్భాశయం మెలికబడటం వల్ల ఈనడం కష్టంగా మారిందని పశువైద్యులు నిర్ధారించి వాహనంలో ఒంగోలులోని వెటర్నరీ పోలీ క్లినిక్‌కు తరలించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి ఆధ్వర్యంలో గేదెకు ఆపరేషన్ చేయించారు. గర్భాశయంలోనే మృతిచెందిన దూడను బయటకు తీసి ప్రాణాలు కాపాడి పాదిలి పశువైద్యశాలకు తరలించారు.


గేదెకు ఆపరేషన్ చేస్తున్న వైద్యసిబ్బంది

కారు ఢీ కొని బాలుడుకి గాయాలు

పొదిలి రూరల్: కారు ఢీ కొని బాలుడుకి గాయాలైన సంఘటన పొదిలి మండలంలోని అక్కచెరువు గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన వేల్పుల ఇర్మియ 10 సంవత్సరాల బాలుడు రోడ్డుపై సైకిల్ నడుపుకుంటున్నాడు. ప్రభుత్వ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు కారులో పొదిలి నుంచి రామాపురం వెళుతున్నారు. అయితే మార్గ మధ్యంలో అక్కచెరువులో అకస్మాత్తుగా బాలుడుని కారు ఢీ కొట్టింది. దీంతో బాలుడు కింద పడి పోవడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. బాలుడుని స్థానికులు వెంటనే పొదిలిలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

17 వరకు డిగ్రీ అడ్మిషన్ల గడువు పొడిగింపు

ఒంగోలు: డిగ్రీ ప్రవేశాల గడువును ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించినట్లు ఒంగోలు డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్ ఆప్షన్లకు కూడా గడువు తేదీని ఈ నెల 20వ తేదీ వరకు ఏపీ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ పొడిగించిందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.